## క్లుప్తంగా

### పోషకాహారంతో రక్త హీనతకు చెక్


ర్యాలీ చేస్తున్న గర్భిణులు, బాలింతలు, ఐసీడీఎస్ సిబ్బంది

చిల్లకూరు : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు చెక్ పెట్టొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తెలిపారు. కమ్మవారిపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భవతిగా ఉన్న సమయంలో సరైనా ఆహారం తీసుకోక పోవడం వల్ల ప్రసవ సమయంలో రక్త హీనత కలిగి ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఆకు కూరలు ఎక్కువగా తినాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అల్లం రాధమ్మ, హెల్పర్ అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న వసంతబాయి

పెళ్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్ వసంతబాయి తెలిపారు. కానూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్ పాయిజన్‌తో ఆరుగురు చిన్నారులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె బుధవారం ఆ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ వర్కర్ శ్రీదేవి, ఆయా రాగమ్మకు మెమో జారీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛమైన నీటిని పిల్లలకు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ సాయిలక్ష్మీ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

చిల్లకూరు : రెవెన్యూ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం వరగలి క్రాస్ రోడ్డు సమీపంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువ వున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారమూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పది గంటల్లోపు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణ, సర్వేయర్ మల్లికార్జున్, అన్ని గ్రామాలకు చెందిన వీఆర్వోలు పాల్గొన్నారు.

### జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం


మాట్లాడుతున్న పట్టాభిరామిరెడ్డి


కలువాయి(సైదాపురం) : మండలంలోని తోపుగుంట గ్రామంలో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఏపీ సివిల్ సప్లయిస్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన జొన్నలను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. క్వింటాల్‌కు రూ.3,371ల గిట్టుబాటు ధరను ప్రకటించినట్టు తెలిపారు. ప్రస్తుతం జిల్లాల్లో 1,000 ఎకరాల్లో జొన్న పంట సాగుచేశారని, 1,500 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ లక్ష్మినారాయణ, వ్యవసాయశాఖ అధికారులు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

### ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు


సైదాపురం : మండలంలోని సైదాపురం-పాదలకూరు రోడ్డులోని షామైన్ సమీపంలో బుధవారం ఆటో బోల్తాపడి నలుగురు కూలీలు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. గూడూరు రూరల్ మండలం పారిచర్లవారిపాళెంకు చెందిన కూలీలు సైదాపురం మండలం జోగిపల్లిలోని గనుల్లో పనులకు వస్తున్నారు. బుధవారం ఉదయం ఆటోలో యధావిధిగా పనులకు బయలుదేరారు. షామైన్ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన నలుగురిని స్థానికులు 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై తమకు సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

---

### కలుషితం


రొయ్యల గుంతల నుంచి వచ్చే వ్యర్థ జలాలను వదులుతుండడంతో కోగిలి చెరువు నీరు కలుషితమవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఆ నీటిని తాగి పశువులు రోగాల బారిన పడి మృతిచెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యలు త్వరగా వృద్ధి చెందేందుకు పలు రసాయనాలు వినియోగిస్తారని చెబుతున్నారు. తర్వాత ఆ నీటిని యజమానులు సప్లయ్ చానల్‌లోకి వదిలేస్తున్నారని, ఆ నీరు చెరువులోకి చేరుతోందని పేర్కొంటున్నారు. నీరు కలుషితం కావడంతో వరి పంటలు కూడా పండడం లేదని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. - చిట్టమూరు

### నిరుపయోగం


రాపూరు మండలంలోని పెంచలకోనలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడ దాతలు కట్టించిన వసతి గృహాలు మినహా ఇతర గదులు లేవు. వసతి కోసం భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భక్తుల కోరిక మేరకు టీటీడీ రూ.4 కోట్లతో 28 గదులు, 6 డార్మెటరీలు నిర్మించారు. ఏడేళ్లవుతున్నా వాటిని ప్రారంభించలేదు. దీంతో గదుల తలుపులు చెదలు పట్టి దెబ్బతింటున్నాయి. పైకప్ప పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతి గృహాలను వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. - రాపూరు

### గోడలకే పరిమితం


దొరవారిసత్రం మండలంలోని చందనముడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం పదేళ్లుగా గోడలకే పరిమితమైంది. గతంలో టీడీపీ హయాంలో రూ.5.50 లక్షలతో భవన నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్ స్లాబ్ వరకు నిర్మించి నిధుల కొరత కారణంగా వదిలేశారు. తర్వాత దాని గురించి పట్టించుకోలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె ఇంటిలో నిర్వహిస్తున్నారు. అక్కడ సౌకర్యాలు లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. - దొరవారిసత్రం

---

# వైఎస్సార్ సీపీ విజయదుందుభి

వెంకటగిరి మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీ జెండా మళ్లీ రెపరెపలాడింది. బలం లేకపోయినా మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి కూటమి చేసిన కుట్రలు ఫలించలేదు. కౌన్సిలర్లు ఏకతాటిపై నిలిచి మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియకు మద్దతు తెలిపారు. తద్వారా అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చేశారు. చైర్ పర్సన్‌గా నక్కా భానుప్రియ కొనసాగుతారని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ అధికారికంగా ప్రకటించారు. దీంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.

- అవిశ్వాస తీర్మానంలో కూటమి కుదేలు
- మున్సిపాలిటీలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలు
- వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మున్సిపాలిటీలో 20 రోజులుగా నెలకొన్న ఉత్కంఠత తొలగిపోయింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం నిర్వహించిన అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా కౌన్సిలర్లు ఓటు వేశారు. చైర్ పర్సన్‌గా నక్కా భానుప్రియ కొనసాగాలని ముక్తకంఠంతో నినదించారు. తద్వారా వెంకటగిరి వైఎస్సార్ సీపీ కంచుకోటని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మరోసారి రుజువుచేశారు. మున్సిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు వైఎస్సార్ సీపీ జెండాతో గెలిచారు. సార్వత్రిక ఎన్నికల ముందు ముగ్గురు కౌన్సిలర్లు కూటమిలోకి వెళ్లిపోయా రు. మరో ముగ్గురు కూటమి నేతలకు టచ్‌లో ఉన్నా రు. ఆరుగురు కౌన్సిలర్లు తమ వైపు ఉండడంతో మరికొంత మందిని ప్రలోభపెట్టి, కేసులు పెడతామ ని బెదిరించి చైర్మన్ పదవిని లాక్కోవాలని కూటమి నేతలు ప్రయత్నించారు. ఇందులో భాగంగా అవిశ్వాస తీర్మానం పెట్టాలని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ క్రమంలో బుధవారం అవిశ్వాసం తీర్మానం పెట్టడానికి అధికారులు నిర్ణయించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కౌన్సిలర్లను ఏకతాటిపైకి తీసుకువచ్చి కూటమి కుట్రలను భగ్నం చేశారు.

**కౌన్సిలర్లకు నేదురుమల్లి భరోసా**

కౌన్సిలర్లను బెదిరించి తమ వైపునకు తిప్పుకోవా లని చూసిన కూటమి నేతలకు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెక్ పెట్టారు. తానున్నానని కౌన్సిలర్లకు భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో కౌన్సిలర్లు కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున బుధవారం ఉదయం ఆరు గంటలకే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, తిరుపతి ఎంపీ గురుమూర్తి కూడా అక్కడికి చేరుకున్నారు. అవిశ్వాస తీర్మానంలో వ్యవహరించాల్సిన తీరుపై కౌన్సిలర్లకు అవగా హన కల్పించారు. అనంతరం వారు రెండు ప్రత్యేక వాహనాల్లో మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా అందరూ ఓటు వేయడంతోపాటు చైర్ పర్సన్‌గా నక్కా భానుప్రియకు మద్దతు తెలిపారు. దీంతో చైర్‌పర్సన్‌గా నక్కా భానుప్రియ కొనసాగుతారని తెలియజేస్తూ ప్రిసైడింగ్ అధికారి, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ ప్రకటించారు. చైర్ పర్సన్ భానుప్రియ, కౌన్సిలర్లను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, బొలిగర్ల మస్తాన్‌యాదవ్ తదితరులు అభినందించారు.

**వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు**

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మళ్లీ నక్కా భానుప్రియ విజయం సాధించడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. విశ్వోదయ క్రీడా ప్రాంగణంలో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. అలాగే పట్టణంలోని క్రాస్ రోడ్డు, నేదురుమల్లి నివాసం వద్ద సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్లు పులి ప్రసాద్, పద్మశాలికార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, నక్కా దుర్గాప్రసాద్, వెంకటగిరి, బాలాయపల్లి, సైదాపురం, డక్కిలి, రాపూరు మండలాల అధ్యక్షులు కాల్తి రెడ్డి శ్రీనివాసులరెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి, మన్నారపు రవికుమార్‌యాదవ్, శ్రీనివాసుల రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.


కౌన్సిలర్లను వాహనంలో తీసుకువస్తున్న ఎంపీ


కౌన్సిలర్లతో తిరుపతి ఎంపీ గురుమూర్తి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

### 15న మండల సమావేశం

రాపూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో భవాని తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

### ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

చిట్టమూరు : వేసవిలో ఎండలు పెరిగిన నేపథ్యంలో పనులు చేసే ప్రాంతంలో ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలని ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆదేశించారు. ఆయన బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామాల్లో డిమాండ్ తగినట్టు కూలీలకు పని కల్పించాలన్నారు. పని జరిగే ప్రదేశాల్లో తాగునీరు, తాత్కాలిక నీడ ఏర్పాటుచేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మస్టర్లను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం షీలు, ఈసీ శరత్, టీఏలు పాల్గొన్నారు.

### చెన్నై నుంచి నెల్లూరు వెళ్లే మెమూ రైలు రద్దు

నాయుడుపేట టౌన్ : పొన్నేరిలో రైల్వే లైన్ల మరమ్మతుల కారణంగా చెన్నై నుంచి నెల్లూరుకు సాయంత్రం నడిచే మెమూ రైలును రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ చిరంజీవి తెలిపారు. చెన్నై నుంచి నెల్లూరు వెళ్లే మెమూ రైలును గురువారం, శనివారం రెండు రోజులు రద్దు చేసినట్లు సమాచారం వచ్చిందన్నారు. తిరిగి రాత్రి నెల్లూరు నుంచి వచ్చే మెమూ కూడా రద్దు చేసినట్లు వివరించారు. ఉదయం వెళ్లే మెమూ రైలు యధావిధిగా రాకపోకలు సాగిస్తుందని, శుక్రవారం యధావిధిగా సాయంత్రం మెమూ రైలు వెళుతుందని పేర్కొన్నారు.

### అక్రమ మైనింగ్‌పై అధికారుల దాడి

సైదాపురం: మండలంలో పర్యావరణ అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తున్న గనులపై బుధవారం విజయవాడకు చెందిన ఎన్విరాన్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. మండలంలోని తలుపూరు, సైదాపురం, జోగిపల్లి గ్రామాల్లోని వినాయక, కనకదుర్గ, పద్మావతి గనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పర్యావరణ అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారి అశోక్ కుమార్ తెలిపారు. ఈ గనుల వ్యవహారంపై కోర్టు నోటీసులు జారీచేయడంతోనే దాడులు చేసినట్టు సమాచారం.

### కండలేరులో 47.372 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 47.372 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

### కూటమి నేతలపై పోలీసులకు ఫిర్యాదు

కలువాయి(సైదాపురం) : హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న కలువాయి నాయీబ్రాహ్మణ కాలనీలోని స్థలాలను కొంతమంది కూటమి నాయకులు తమ వారికి కేటాయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జేసీబీతో స్థలాలను చదును చేస్తుండగా అదే గ్రామానికి చెందిన రేవూరి యానాదయ్య అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ స్థలంపై హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. కూటమి నాయకులు లెక్కచేయకుండా స్థలంలోకి ప్రవేశించి చదును చేస్తున్నారని తెలిపారు. అడ్డుకున్న తనను కులం పేరుతో దూషించారని పేర్కొన్నారు.

---

### ఉచ్చూరులో గడ్డివామి రగడ


గడ్డివామి వద్ద సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

దొరవారిసత్రం : మండలంలోని ఉచ్చూరులో వేసిన గడ్డివామి రెండు వర్గాల మధ్య వివాదంగా మారింది. ఒక వర్గం వారికి అధికార పార్టీ నేతల మద్దతు ఉండడంతో అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి బుధవారం గడ్డివామిని తొలగించేందుకు ప్రయత్నం చేయడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉచ్చూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 292లో 11.19 ఎకరాల గ్రామ కంఠం భూమి ఉంది. ఇందులో 20 ఏళ్ల క్రితం అప్పటి రెవెన్యూ అధికారులు గ్రామానికి చెందిన మప్పేటి కనమ్మకు 70 సెంట్ల భూమికి పట్టా ఇచ్చారు. ఆమె అందులో ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. (నిబంధనల ప్రకారం సాగు కోసం ఇచ్చిన భూమిలో ఇల్లు నిర్మించుకోకూడదు.) మిగిలిన భూమి 50 ఏళ్లుగా అదే గ్రామానికి చెందిన వందవాసి ఆదెమ్మ ఆధీనంలో ఉంది. ఈ క్రమంలో కనమ్మ ఇంటి ప్రహరీని ఆనుకుని ఆదెమ్మ గడ్డివామి వేసుకుంటున్నారు. గడ్డివామి స్థలం కూడా తమదేనంటూ కనమ్మ తమ్ముడు గుమ్మిడిపూడి చెంచుకృష్ణయ్య, అతని కుమారుడు నరసింహులు వాదిస్తున్నారు. వారికి అధికార పార్టీ నేతల అండ ఉండడంతో అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి గడ్డివామి స్థలాన్ని కైవశం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ శైలకుమారి వివరణ ఇస్తూ ఉచ్చూరు గ్రామంలోని గ్రామ కంఠం భూమిలో 70 సెంట్లను సాగు భూమి కింద పట్టా ఇచ్చారని తెలిపారు. దాని ప్రకారమే కొలతలు వేసి బాధితులకు స్థలం చూపించేందుకు తమ సిబ్బంది సర్వే చేసినట్టు తెలిపారు. గ్రామంలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు.

### బీచ్ రోడ్డు పనులు చేపట్టాలని వినతి


రోడ్డు పనులు చేపట్టాలని కలెక్టర్‌ను కోరుతున్న గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం

చిల్లకూరు : మండలంలోని గమ్మళ్లదిబ్బ నుంచి సముద్రం బీచ్ వరకు రోడ్డు పనులు చేపట్టాలని తమ్మినపట్నం సర్పంచ్ నెల్లిపూడి సుబ్రహ్మణ్యం కోరారు. సముద్రంలోకి తాబేలు పిల్లలను వదలడానికి బుధవారం గమ్మళ్లదిబ్బ వద్దకు వచ్చిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో 4 కిలోమీటర్ల మేర రోడ్డు వేయడానికి కేంద్ర ప్రభుత్వం రూ.3.12 కోట్లు మంజూరు చేసిందన్నారు. అటవీ శాఖ ఆంక్షలున్నట్టు అధికారులు చెప్పడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అటవీశాఖ అధికారితో మాట్లాడి రోడ్డు వేయడానికి ఉన్న ఆంక్షలను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### చట్ట సభల్లో ముదిరాజ్‌లకు స్థానం కల్పించాలి


విష్ణు వర్ధన్ రావు, చెంచు కృష్ణయ్యను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నాయుడుపేట టౌన్ : చట్ట సభల్లో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్‌రావు కోరారు. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ఆయనకు బుధవారం ఆ సంఘం నాయకులు నాయుడుపేటలోని మల్లాం జాతీయ రహదారి కూడలి వద్ద ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 29 లక్షల మందికి పైగా ముదిరాజ్‌లు ఉన్నారని తెలిపారు. జనాభా ప్రాతిపతికన తమకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆ సంఘం నాయకుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంచుకృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ముదిరాజ్‌లు ఎక్కువ మంది ఉన్నారని, వారికి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ప్రాధాన్యత కల్పించేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కోర్నా వెంకటనారాయణ, భువనగిరి శేషగిరిరావు, పాము రవికుమార్, పెరుమాళ్ల వీరన్న, మణిమేల రాజేష్, కనకట్ల మోహన్, గోనుపల్లి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి వసంతోత్సవాలకు అంకురార్పణ


పెంచలకోనలో వసంతోత్సవాలకు అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వసంతోత్సవాలకు బుధవారం రాత్రి వేదపండితులు అంకురార్పణ చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేక హోమం చేశారు. ఆలయ ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామ య్యస్వామి మాట్లాడుతూ స్వామివారికి వేసవి తాపాన్ని తగ్గించేందుకు చైత్రమాసం వసంత రుతువులో వసంతోత్సవాలు నిర్వహించడం ఆచారమన్నారు. ఈక్రమంలో నందన వనంలోని పుట్టమట్టి ని తీసుకువచ్చి అందులో నవధాన్యాలు కలిపి ప్ర త్యేక పూజలు చేసినట్టు తెలిపారు. అనంతరం అనుజ్ఞ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, మత్సంగ్రహణం, అంకురార్పణ చేశారు.

# గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ హరిప్రసాద్, తదితరులు

గూడూరు రూరల్ : గూడూరు ఏరియా ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన గర్భిణులకు జేవీవీ ప్రతినిధులు పౌష్టికాహారం అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా బేగం మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో ప్రతి నెలా గర్భిణులకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. ఈ నెల డాక్టర్ హరిప్రసాద్ పౌష్టికాహారం అందజేశారని తెలిపారు. డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ జేవీవీ ప్రజలకు సైన్సుపై అవగాహన కల్పించడమే కాకుండా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీమన్నారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, పురుషోత్తం రావు, రామ్మోహన్, ప్రభాకర్, ఇబ్రహీం, సుబ్బారావు పాల్గొన్నారు.

**గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి**

రాపూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని చెల్లటూరు, పెనుబర్తి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వెయ్యి రోజులు ఎలాంటి ఆహారం తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారో తెలియజేశారు.

### ఇసుక రీచ్‌పై మైనింగ్ అధికారుల దాడి

సాక్షి ఎఫెక్ట్..

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలం తెలుగురాయిపురంలో అనధికారంగా నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌లపై బుధవారం మైనింగ్ అధికారులు దాడి చేశారు. ఒక ప్రొక్లైన్, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. కప్పం కట్టు.. లోడెత్తు అన్న శీర్షికన గత ఆదివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు దాడి చేశారు.


సీజ్ చేసిన వాహనాలు